క్లుప్తంగా

గ్రామాల్లో వికసిత్ సంకల్ప యాత్ర



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

యాడికి: మండలంలోని వేములపాడు, నగరూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించినట్లు ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రచార రథం వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వేములపాడు, నగరూరు సర్పంచులు ఓంకారమ్మ, రుక్మాందరరెడ్డి, నాయకులు రమానందరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రసూల్, ఏపీఎం హేమలత, ఏఓ మహబూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శి అరుణ కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో ఆదివారం బైక్‌పై నుంచి పడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కర్నూలు జిల్లా రాతనకు చెందిన శ్రీరాములు, అన్నమయ్య బైక్‌పై పని నిమిత్తం పామిడికి బయలు దేరారు. మార్గం మధ్యలోని గుత్తి శివారులో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడినవారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

గుత్తి: తమ డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరుతూ గుత్తిలో ఆదివారం అంగన్‌వాడీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకుర్యాలీ సాగింది.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యుడు సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక రూపంలో దర్శనమిచ్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా క్రిస్మస్ ఆరాధన



పామిడి సీఎస్ఐ చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రిస్మస్ ఘనంగా ఆరాధన నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మాట్లాడుతూ క్రీస్తు ఈ లోకాన జన్మించడం ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానం అన్నారు. ప్రజలందరి కోసం ఈలోకాన ఓ శిశువు, కుమారుడు అనుగ్రహించబడిన రోజును క్రైస్తవులు క్రిస్మస్ పండుగగా ఆచరిస్తారన్నారు. క్రీస్తును ఆరాధించడమే క్రిస్మస్ అన్నారు. ఈసందర్భంగా పిల్లల నృత్యప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జకరయ్య, అబ్రహాం, ఆనంద్‌రాజ్, ఇల్లూరు రాజు, అరుణ్, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణ, శాంతమ్మ, అనూష, మెర్సీ, రేచెల్, ఎలిజబెతమ్మ, రజని తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని హెచ్‌పీఎస్ పాఠశాలలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో క్రిస్మస్, యేసు జీవిత చరిత్రను నాటక రూపంలో వివరించారు. పాఠశాల జీఎం రామసుబ్బారెడ్డి, సీఈఓ ప్రతాప్‌రెడ్డి, ఏజీఎం శంకరనారాయణ, ప్రిన్సిపాల్ బాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గార్లదిన్నె హెచ్‌పీఎస్ పాఠశాలలో వేషధారణలో చిన్నారులు

పురపాలకులా... అభివృద్ధి నిరోధకులా!

- తాడిపత్రి అభివృద్ధికి మోకాలడ్డుతున్న చైర్మన్ జేసీ
- మంజూరైన పనులకు వర్కార్డర్లు ఇవ్వని వైనం
- అభివృద్ధి జరిగితే అధికార పార్టీకి పేరొస్తుందని దుగ్ధ



ఎమ్మెల్యే పెద్దారెడ్డి చొరవతో చేపడుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో పుర పాలకులే... అభివృద్ధి నిరోధకులుగా మారారని పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి భయంతోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి అభివృద్ధికి అడ్డుపడుతూ తన దుగ్ధను బయటపెడుతున్నాడని చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీలో టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్నా వాటికి సైతం వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మోకాలడ్డుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సహకారంతో పట్టణంలో పూర్తి చేసిన దాదాపు రూ.30 లక్షల పనులకు వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా కాంట్రాక్టర్లను వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రిలో అభివృద్ధి పనులు జరిగితే తన రాజకీయ భవిష్యత్ ఉండదని భయంతోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసి వాటిని అధికార పార్టీపై నెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రిలో జరిగే అభివృధి నిర్మాణాల కాంట్రాక్టర్లను బెదిరింపులకు గురి చేస్తూ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చైర్మన్ ఇంటి ముట్టడికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. మున్సిపల్ చైర్మన్ హోదాలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ తాడిపత్రి అభివృద్ధి కంటకుడిగా మారాడని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

పనులు పూర్తయినా..

కాంట్రాక్టర్లు టెండర్ల ద్వారా దక్కించుకున్న పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్‌లో దాదాపు రూ.10లక్షల వ్యయంతో సీసీరోడ్డు, డ్రైనేజీ, పైప్ లైన్లకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అలాగే ఎస్‌టీపీ–2 వద్ద రూ.8 లక్షలతో పనులు, పట్టణంలోని 36 వార్డులో రూ.10 లక్షల వ్యయంతో మ్యాన్‌హోల్స్ క్లీనింగ్ పనులు చేపట్టారు. అయితే వీటి పనులు పూర్తయినా వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా కాంట్రాక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారు. అలాగే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ప్రభుత్వం పట్టణంలో తాగునీరు సమస్యను పరిష్కరించేందుకు అమృత్–2 కింద దాదాపు రూ.63 కోట్లు విడుదల చేసింది. 15 ఆర్థిక సంఘం కింద రూ.3 కోట్లు నిధులు విడుదల అయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని ఖర్చు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ప్రజా సమస్యలు మరిచి మున్సిపల్ కార్యాలయానికి రాకుండా కాలయాపనకే పరిమితం అయ్యాడు. నిధులను ఖర్చుచేసి అభివృద్ధి పనులు చేపడితే వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మంచిపేరు వస్తుందని.. వచ్చే ఎన్నికల్లో తనకు మరోసారి ఓటమి తప్పదని భావిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కుట్రలు, కుతంత్రాలు మాని తాడిపత్రి అభివృద్ధికి పాటుపడాలని పట్టణ ప్రజలు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని కోరుతున్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే



కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

గుంతకల్లుటౌన్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గంలోని క్రైస్తవులు, ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసూక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తాడిపత్రి అర్బన్: క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు జన్మదినం, ప్రేమ, అప్యాయతలను బోధిస్తాయని, ప్రేమ, సహనం, త్యాగం, క్షమాగుణం, కరుణ క్రీస్తు ఇచ్చిన గొప్ప సందేశాలన్నారు. క్రీస్తు బోధనలు ఎల్లప్పుడూ మనుషులను సన్మార్గంలో నడిపిస్తాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో డ్రైనేజీ సమస్య పరిష్కారం



చిక్కేపల్లిలో డ్రైనేజీ పనులు చేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో పరిష్కారం లభించింది. వివరాలు.. మండలంలోని చిక్కపల్లిలో ఓ వైపు తాగునీటి సమస్య, మరోవైపు అండర్ డ్రైనేజీ సమస్యతో కొన్నేళ్లుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, ప్రజాసంక్షేమ పాదయాత్రలో ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్వయంగా సమస్యను వివరించారు. స్పందించిన ఆయన ఇంటింటికీ కొళాయి ఏర్పాటుతో పాటు, డ్రైనేజీల ఏర్పాల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి రూ.14 లక్షల నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం గ్రామంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏళ్ల తరబడి గ్రామంలో సమస్య ఉన్నా గత ప్రభుత్వంలోని పాలకులు చేస్తామని కల్లబొల్లిమాటలు చెప్పారేగానీ నెరవేర్చిన పాపాన పోలేదని, ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించడం ఆనందంగా ఉందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచు దివ్య, వైస్సార్ సీపీ నాయకులు రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి పనులు నిత్యం పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నారు.

పత్రలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



కల్లూరులో ర్యాలీ చేస్తున్న పత్ర కులస్తులు

గార్లదిన్నె: ప్రభుత్వం పత్ర కులస్తులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంతరాయుడు పేర్కొన్నారు. ఆదివారం కల్లూరులో మంజునాథ ఫంక్షన్ హాల్లో పత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లార్పించి అక్కడ నుంచి మంజునాథ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పత్ర కులస్తులను త్వరలో చేపట్టే కులగణన సర్వేలో బీసీ ఏ కింద చేర్చాలన్నారు. 100 యూనిట్లు ఉచిత కరెంట్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పత్ర కులానికి సంబంధించిన 150 పేజీల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శింగనమల నియోజకవర్గం పత్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చీమల రామక్రిష్ణ, గార్లదిన్నె మండల అధ్యక్షుడిగా పిల్లల శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పత్రా లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులు చీమల శ్రీని వాసులు, గౌరవాధ్యక్షులు చిన్నఆంజనేయులు, రామాంజనేయులు, ఉప్పల పాటి రామక్రిష్ణ, బృందావన్ రామాంజనేయులు, పెద్దపోతుల పవన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే వైవీఆర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్లు పెట్టుకున్న వారికి బకాయిలను విడుదల చేయాలని, సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించాలని కోరారు. తమ సమస్యలు, న్యాయమైన కోర్కెలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు బి.శ్రీనివాసులు, పట్టణ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, శంకరయ్య, ఎల్లన్న, కల్పన, మురళీ, మోహన్‌బాబు, తిమ్మారెడ్డి, చలపతి తదితరులు ఉన్నారు.

రామయ్య విగ్రహాలు, అక్షింతల ఊరేగింపు



పామిడిలో అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పామిడి ఖండ ఆధ్వర్యంలో స్థానిక నగేశ్వరాలయం నుంచి పురవీధుల్లో యాత్ర సాగింది. ఈసందర్భంగా మహిళలు, చిన్నారులు, పెద్దలు కళశాలు, కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు, మహిళలు, శ్రీరామభక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో రామ భక్తులు, అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య రామయ్య(రాముడు) అక్షింతలు, విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో ఊరేగించారు. అయ్యప్ప ఆలయం వద్ద నుంచి ఆర్ఎస్‌లోని పుర వీధుల గుండా ఊరేగింపు సాగింది. భక్తులు తలపై అయోధ్య అక్షింతలను పెట్టుకుని జై శ్రీరామ్, జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. భక్తులు ఆనందంతో చిందులు వేశారు. ఇంటింటికి అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు పంపిణీ చేశారు.

‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుత్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంఈఓ రవినాయక్ ఆదేశించారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఈ నెల 26 నుంచి ప్రారంభించాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా పోటీలకు అంపైర్లుగా ప్రతి సచివాలయం నుంచి ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం అందించాలన్నారు. పోటీల నిర్వహణలో గ్రామ కార్యదర్శులు ముఖ్యభూమిక పోషించాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా సామగ్రిపై ఆరా తీశారు. 13 సచివాలయాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్, సిబ్బంది వాసు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: ఈనెల 26 నుంచి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఈమేరకు ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. సచివాలయ పరిధిలో గెలుపొందిన విజేతలకు మండల స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులు పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

గార్లదిన్నె: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో గెలుపొందిన క్రీడాకారులకు జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలోపోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్లు చేసుకున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు.

సర్పరూపుడికి విశేష పూజలు



ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. తులసీ దామోదర చెట్టు వద్ద పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం నిర్వహించారు.

ప్లేస్‌మెంట్‌లో ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రభంజనం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రభంజనం సృష్టించారు. ఏకంగా 34 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కళాశాలలో గత నెల 20, 21 తేదీల్లో ప్రముఖ గ్లోబల్ కంపెనీ అయిన యాక్సంచర్ సమగ్ర ఆన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందన్నారు. ఇందులో కళాశాలకు చెందిన 398 మంది మొదటి రౌండ్ మూల్యాంకనం, ఆప్టిట్యూడ్ క్రిటికల్, అబ్‌స్ట్రాక్ రీజనింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. అందులో 71 మంది విద్యార్థులను ఎంపిక చేసి వీరికి కోడింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్ పరీక్షలు నిర్వహించారు. చివరగా 34 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.

ట్రెక్కింగ్‌లో విద్యార్థులు

ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ట్రెక్కింగ్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్ బెల్గాం(కర్ణాటక)లో కొనసాగుతోందన్నారు. ఈ సాహస శిబిరానికి దక్షిణ భారత డైరెక్టరేట్ల నుంచి 500 మంది క్యాడెట్లు హాజరయ్యారన్నారు. ఇందులో కళాశాలకు చెందిన కార్తీక్ శ్రీమంత్, విజయ్ భాస్కర్, సి.ప్రవీణ్‌కుమార్, శేషాద్రి నాయుడు, లోకేష్, ఆదర్శ బాబు, పి. ప్రవీణ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

సాక్షి నెట్‌వర్క్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో చర్చిలు (ప్రార్థనా మందిరాలు) సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. చర్చిలు విద్యుత్ దీపాల కాంతులతో దేదీప్యమానంగా మారాయి. క్రైస్తవులు తమ ఇళ్లను క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు(నక్షత్రాలు), తోరణాలతో అందంగా అలంకరించుకున్నారు. ప్రభువు సన్నిధిలో ప్రార్థనలు నిర్వహించేందుకు క్రైస్తవులు సన్నద్ధమవుతున్నారు. దుకాణాల్లో సైతం సందడి వాతావరణం నెలకొంది.



గుంతకల్లులోని భాగ్యనగర్‌లో ముస్తాబైన ఎస్‌పీజీ చర్చి



గుంతకల్లులో విద్యుత్ దీపాల కాంతులతో మేరీమాత చర్చి



తాడిపత్రిలో ముస్తాబైన ఆర్సీఎం చర్చి



యాడికిలో విద్యుద్దీపాలంకరణలో అగాపే చర్చి



విద్యుద్దీపాలంకరణలో పామిడి సీఎస్ఐ చర్చి

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం




రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆలూరు సాంబ శివారెడ్డి



పూజల్లో పాల్గొనడానికి వెళుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: మండలంలోని చిలమకూరు గ్రామంలో వెలిసిన పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చనలు, అభిషేకాలు, హోమాలు వంటి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు బాలాజీ స్వామితో పాటు తమిళనాడుకు చెందిన ప్రముఖ అర్చకుల మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర విద్యా సలహాదారులు ఆలూరు సాంబ శివారెడ్డి, తాడిపత్రి కేతిరెడ్డి పెద్దారెడ్డి, జిల్లా పైలా నరసింహయ్య, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి ఆంజనేయస్వామికి పూజలు చేయించారు. ఈ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలను రాష్ట్ర విద్యా సలహాదారులు ఆలూరు సాంబ శివారెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన వృషభాలకు బహుమతులు ప్రదానం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు పెద్ద నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





శింగనమల: అలంకరణలో పూజలు అందుకున్న దుర్గాంజనేయ ఆంజనేయస్వామి

శింగనమల: శింగనమలలోని చెరువు కట్ట మీద ఉన్న దుర్గాంజనేయ ఆలయంలో ఆదివారం హనుమాన్‌వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శింగనమల, అనంతపురం నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పామిడి: స్థానిక షాదీఖానాలో పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన సుందర శ్రీకర మహాయాగం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: చంద్రశేఖరేంద్ర సరస్వతి జ్ఞానపీఠం ఆధ్వర్యంలో సుందర శ్రీకర మహాయాగం మహాపూర్ణాహుతితో ఆదివారం ముగిసింది. ఉదయం హనుమద్ వ్రతం, మన్యుసూక్త అభిషేకం, హనుమద్ అష్టదశాక్షరి హోమం, మహాపూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగాయి. చెన్నైకి చెందిన గుహానందమండలి వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గోటేటి శ్రీనివాసరావు, మధుసూదనరావు ఆధ్వర్యంలో పండితులు, రుత్వికులు మహాయాగంలో పాల్గొన్నారు.